జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
వరంగల్
ములుగు - మహబూబాబాద్
జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ
శుక్రవారం | 27 | మార్చి | 2026 ◆ పేజీలు : 9

# బచ్చన్నపేట మండలంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన

- వైద్యులు అందుబాటులో ఉండాలి రోగులకు సమయానుగుణంగా వైద్యం అందించాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం అంగన్వాడీ కేంద్రాల సేవలు కీలకం
- విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

2 లో...



- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

# రైస్ మిల్లర్లు వరి ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- మిల్లర్లతో సమీక్షా సమావేశం



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మార్చి 26, (ప్రజా జ్యోతి):** జిల్లాలో రబీ సీజన్ కు సంబంధించి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని రైస్ మిల్లర్లు దిగుమతి చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని

మిగతా 2 లో...












# బచ్చన్నపేట మండలంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన

- వైద్యులు అందుబాటులో ఉండాలి రోగులకు సమయానుగుణంగా వైద్యం అందించాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి
- చిన్నారుల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం అంగన్వాడీ కేంద్రాల సేవలు కీలకం
- విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 26 (ప్రజాజ్యోతి):** జిల్లాలోని బచ్చన్నపేట మండలలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఆకస్మికంగా పర్యటించి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది రిజిస్టర్, ఓపి రిజిస్టర్, పిల్లల వార్డు, ఇన్ పెషేంట్ వార్డులను, మందుల నిల్వలను పరిశీలించారు. ఓపీ ద్వారా ప్రతి రోజు ఎంత మంది వైద్యం పొందుతున్నారు.

ఎంత మంది గర్భిణీ స్త్రీలకు ప్రసవాలు జరిగాయి అని వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీల ప్రసవాల సంఖ్యను మరింతగా పెంచాలని, అందుకు తగ్గట్లుగా వైద్యాధికారులు, ఆశాలు పని చేయాలన్నారు. ఇన్ పెషేంట్ వార్డులోకి వెళ్లి రోగులతో మాట్లాడి వారి సమస్యలు వివరాలు తెలుసుకున్నారు. ఆసుపత్రి లోపల, పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తా చెదారం, పిచ్చిమొక్కలను తొలగించాలని, చెట్లను సంరక్షిస్తూ పచ్చదనాన్ని పెంపొందించాలని తెలిపారు.

అనంతరం రాఘవాపూర్, మన్సాన్ పల్లి, లింగంపల్లి, కొన్నె, రామచంద్రాపురం, ఇటిక్యాల పల్లి గ్రామాల్లో జరుగుతోన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పర్యవేక్షించారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలను తప్పకుండా పాటించాలని అధికారులకు సూచించారు. పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

నిర్మాణ సామగ్రి నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి, ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, గృహ ప్రవేశాలు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పని చేసి ఈ లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం మన్సాన్ పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కేంద్రంలో నమోదైన చిన్నారుల ఎత్తు, బరువు కొలతలను పరిశీలించారు.

పిల్లల ఎదుగుదలను నిరంతరం పర్యవేక్షించడం ఎంతో ముఖ్యమని, ప్రతి చిన్నారి ఎత్తు, బరువు వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి, వారికి ప్రత్యేక ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. చిన్నారుల ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలను అడిగి తెలుసుకొని, వృద్ధి చార్టుల ఆధారంగా పిల్లల ఆరోగ్య స్థితిని విశ్లేషించి, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కోసం అంగన్వాడీ కేంద్రాల సేవలు కీలకమని కలెక్టర్ తెలిపారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, గుడ్లు, పాలు, పప్పులు తదితరాల నాణ్యతను పరిశీలించారు.

ఆహార పదార్థాల నిల్వ విధానం, వంటశాల పరిశుభ్రత, పిల్లల హాజరు వివరాలను పరిశీలించారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు అందిస్తున్న సేవలు, పోషణ కార్యక్రమాల అమలు విధానంపై వివరాలు తెలుసుకున్నారు.

రికార్డులను కూడా పరిశీలించి, సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

అనంతరం మన్సాన్ పల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించి, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరుగుతున్న బోధన విధానం, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, వారి చదువు స్థాయి, అర్థం చేసుకునే సామర్థ్యాన్ని కలెక్టర్ పరీక్షించారు. పాఠ్యాంశాల బోధనను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు విధానాన్ని పరిశీలించి, ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యమని కలెక్టర్ తెలిపారు.

ఈ పర్యటనలో హౌసింగ్ పీడీ మాత్రు నాయక్, ఇతర సంబంధిత అధికారులు, అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


## రైస్ మిల్లర్లు వరి దాన్యాన్ని దిగుమతి చేసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

కాన్ఫరెన్స్ హాలు లో రబీ సీజన్ కు సంబంధించి రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపు, దిగుమతి, తదితర అంశాలపై జిల్లాలోని రైస్ మిలర్లతో సమీక్షా సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆయా ప్రాంతాలలో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కేటాయింపులు చేయనున్నట్లు తెలిపారు. సంబంధిత ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం దిగుమతి చేసుకోవాలని రైస్ మిల్లర్లకు సూచించారు. ధాన్యం కేటాయింపు విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి రైస్ మిల్లర్లు తీసుకురావాలని తెలిపారు. ధాన్యం కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు ప్యాడి క్లీనర్ల ద్వారా శుభ్రపరచిన ధాన్యాన్ని బిల్లులకు పంపించాలని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు తమ రైస్ మిల్లులో ధాన్యాన్ని భద్రపరచుకునేందుకు వీలుగా సరైన స్థలాన్ని ఉండేటట్లు చూసుకోవాలన్నారు. మిల్లులకు నేరుగా వచ్చిన ధాన్యాన్ని తీసుకోవద్దని మిల్లర్లకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎండి వాజిద్ అలీ, జిల్లా సివిల్ సప్లై కార్పొరేషన్ మేనేజర్ మహేందర్, ఇతర అధికారులతో పాటు జిల్లాకు సంబంధించిన రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక వాతావరణంలో భద్రకాళి ఆలయాన్ని సందర్శించిన ప్రముఖులు



**హనుమకొండ, మార్చి 26 (ప్రజా జ్యోతి)** శ్రీ భద్రకాళి దేవస్థానాన్ని గురువారం సాయంకాలం పలువురు ప్రముఖులు సందర్శించారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలిదండ నిత్యానంద రావు మరియు కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు బన్న ఐలయ్య అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి సంప్రదాయ పూర్వక స్వాగతం పలికారు. జానపద గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతులు డాక్టర్ గడ్డం వెంకన్న, సతీష్, సునంద తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. దర్శనం అనంతరం ఆలయ ధర్మకర్త తొనుపునూరి వీరన్న అతిథులను సత్కరించి, అమ్మవారి శేష వస్త్రాలు బహూకరించి ప్రసాదాలు అందజేశారు. ఆలయ పరిపాలన, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం భక్తుల మధ్య ఆధ్యాత్మిక అనుబంధాన్ని మరింత బలపరిచేలా జరిగింది.

## బీసీ కమిషన్ ఛైర్మన్‌ను కలిసిన కలెక్టర్



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, మార్చి 26, (ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ హనుమకొండలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు గురువారం జిల్లాకు విచ్చేసిన సందర్భంగా, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. టీజీ ఎన్పీడీసీఎల్ అతిథి గృహంలో కలెక్టర్, బీసీ కమిషన్ ఛైర్మన్‌ను ఆత్మీయంగా కలసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సంక్షిప్తంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ మధుసూదన్ రావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సెయింట్ మేరీస్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ వేడుకలు

**హసన్‌పర్తి, మార్చి-26 (ప్రజాజ్యోతి):** హసన్‌పర్తి మండల కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉన్నత బాలవిహార విద్యార్థులకు పతకాలు, ధృవపత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాకాల తిరుమలేశ్వర్ రెడ్డి అందజేశారు. ఉదయం నుంచి ఉపాధ్యాయులు కీర్తన, విజిత ఆధ్వర్యంలో విద్యార్థులను అందంగా ముస్తాబు చేసి పట్టాలు అందుకునేందుకు సిద్ధం చేశారు. రాబోయే విద్యాసంవత్సరం నుంచి ఈ విద్యార్థులు తదుపరి తరగతుల్లో ప్రవేశిస్తారని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు ఎలుక రాజు సదానందం, ఉపాధ్యాయులు విజయరాణి, అంజద్, రవి నాయర్, సింధు, లత, లలిత రాజపుత్, అనురాధ, రజిని, కళ్యాణి, సంధ్యారాణి, సంధ్య, ప్రియాంక, శృతి, రాజేంద్రప్రసాద్, సంపత్, రాధిక, సునీత, వ్యాయామ ఉపాధ్యాయుడు సదానందం, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.









# అర్ధరాత్రి దాడి.. యువకుడికి తీవ్ర గాయాలు

**హసన్‌పర్తి,మార్చి–26(ప్రజాజ్యోతి):** బుధవారం అర్ధరాత్రి వేళ జరిగిన ఘటన ఘర్షణలో ఓ యువకుడిపై కత్తితో దాడి జరగగా, అతడు తీవ్రంగా గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... రామారం పరిధిలోని ప్రొద్దుటూరు గార్డెన్ సమీపంలో కొత్తగా నిర్మాణంలో ఉన్న ఇంటికి కాపలాదారుగా పనిచేస్తున్న లోకిని కొమురయ్య వద్దకు అతని మేనల్లుడు పాలకుర్తి సురేష్ (33) వచ్చి ఉన్నాడు. ఇద్దరూ రాత్రి విశ్రాంతి తీసుకుంటుండగా, ఎల్కతుర్తి ప్రాంతానికి చెందిన లోకిని కార్తీక్ అక్కడికి చేరుకున్నాడు. ఇటీవల ద్విచక్ర వాహనం విషయమై జరిగిన వివాదాన్ని మనసులో పెట్టుకున్న కార్తీక్, రాత్రి సుమారు పదకొండు గంటల ముప్పై నిమిషాల సమయంలో సురేష్‌పై కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో సురేష్‌కు కడుపు భాగంలో గాయాలు కాగా, కొమురయ్యకు స్వల్ప గాయాలు అయ్యాయి.గాయపడిన సురేష్‌ను సమాచారం అందుకున్న 108 అంబులెన్సు సిబ్బంది పైలట్ నాగరాజు, మెడికల్ టెక్నీషియన్ ప్రకాష్ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా



ఉందని సమాచారం.ఇదిలా ఉండగా, పాత కక్షల నేపథ్యంలో జరిగిన ఈ ఘటనపై కాకతీయ యూనివర్సిటీ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి,



నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

## ధర్మసాగర్ మండలంలో ఉచిత వైద్య శిబిరం – ప్రజల నుండి విశేష స్పందన



**ధర్మసాగర్, మార్చి 26 (ప్రజా జ్యోతి)** ధర్మసాగర్ మండల కేంద్రంలో స్థానిక ప్రజలకు క్రీస్తు జ్యోతి సంస్థ వారు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రముఖ వైద్యులు డా. సత్యం చందా మరియు డా. బి. రూత్ బియులా ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు దంత వైద్యం, రక్తపరీక్షలు, షుగర్, బీపీ వంటి ప్రాథమిక పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో హాజరై వైద్య సలహాలు పొందారు. ప్రత్యేకంగా దంత సమస్యలు, ముక్కు గాయాలు, మరియు ఇతర సాధారణ ఆరోగ్య సమస్యలపై వైద్యులు వివరంగా సూచనలు ఇచ్చారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని స్థానికులు తెలిపారు. ఇలాంటి వైద్య శిబిరాలను తరచూ నిర్వహించాలని వారు కోరుకున్నారు. ఈ శిబిరంలో సుమారు 100కి పైగా మంది లబ్ధిదారులు వైద్య సేవలు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు.

## తహసీల్దార్ కార్యాలయం లో మహిళా ఉద్యోగులకు మౌళిక సదుపాయాల లేక అవస్థలు



**కొడకండ్ల, మార్చి 26 (ప్రజాజ్యోతి ) :** మండల కేంద్రములో తహసీల్దార్ కార్యాలయంలో పని చెస్తున్న మహిళ ఉద్యోగులకు మౌళిక సదుపాయాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక మరుగు దొడ్లు లేవు, ఇందులో మహిళలు, డిప్యూటీ తహశీల్దార్, జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు రికార్డు అసిస్టెంట్ లు, ఒక సర్వేయర్ లు పనిచేస్తారు. వీరితో పాటు బిఎల్ఓలు, భూమి రిజిస్ట్రేషన్ కోసం నిరంతరం వచ్చే మహిళలు, వివిధ దృవీకరణ పత్రాల కోసం వచ్చే విద్యార్థినులకు కనీస మౌళిక సదుపాయాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటి కైనా సంబంధించిన జిల్లా అధికారులు చొరవ తీసుకొని తహసీల్దార్ కార్యాలయంలో మహిళలకు మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. ఈ విషయంపై స్థానిక తహశీల్దార్ అనిల్ బాబును ప్రజాజ్యోతి వివరణ కోరగా ప్రస్తుతం కొత్తగా బదిలీపైన వచ్చానని ఈ విషయం పై అధికారుల దృష్టికి తీసుకు వెలుతానని ఆయన తెలిపారు.

## నేడు నగరంపల్లి లో సీతారాముల కళ్యాణ మహోత్సవం

**గణపురం ప్రజా జ్యోతి మర్చి 26** గణపురం మండలం నగరంపల్లి గ్రామంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో నేడు శుక్రవారం సీతారాముల



కళ్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని డాక్టర్ పాశం నాగరాజు, సింధు దంపతులు నిర్వహించనున్నారు. ఈ కళ్యాణ మహోత్సవానికి గ్రామస్థులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కళ్యాణ మహోత్సవం అనంతరం ఆలయ ప్రాంగణంలో మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

- **తొలి రోజు 66 మందికి వైద్య పరీక్షలు, ఆపరేషన్లకు 27 మంది ఎంపిక**



**ఖానాపురం /మార్చి 26 (ప్రజా జ్యోతి)** ఖానాపురం మేజర్ గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ దాసరి రమేష్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో శంకరం కంటి దవఖాన వారు నిర్వహించిన ఈ వైద్య శిబిరంతో మధ్య తరగతి మరియు ఆర్థిక స్తోమత లేని వారికి ఎంతో లాభదాయకమన్నారు. స్వయంగా ప్రయాణ చార్జీలు భోజన సౌకర్యం కల్పించి, నాణ్యమైన అన్ని రకాల కంటి చికిత్సలను అందిస్తున్న వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. నేడు నిర్వహించిన కంటి పరీక్షలలో పాల్గొన్న 66 మందిలో, ఆపరేషన్ అవసరమైన 27 మందికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతినెల ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని, ప్రజలందరూ సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుప్రజ ఉపసర్పంచ్ ఉప్పు రాజు, వార్డు సభ్యులు గుండ్లపల్లి విజయ్, వేములపల్లి వెంకట ప్రసాద్ రావు, మహమ్మద్ అజహర్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు, మాజీ సర్పంచ్ పరుచూరి సుబ్బారావు, నాయకులు మచ్చిక అశోక్, మర్రి రామస్వామి, గంగాపురం రమేష్, భూక్య నవీన్, జటంగి మహేష్, బిక్షం, పోషాలు, శంకర కంటి ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది, ప్రగతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిఎల్ఓ లకు ఎస్ఐఆర్ పై ఒక రోజు శిక్షణ

**కొడకండ్ల, మార్చి 26 (ప్రజా జ్యోతి) :** మండల కేంద్రం లోని తహసీల్దార్ కార్యాలయంలో (ఎస్ఐఆర్). ఇంటి ఇంటికి సమగ్ర ఓటరు సవరణ సర్వే పై బిఎల్ఓ లకు తహసీల్దార్ అనిల్ బాబు ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహ



సీల్దార్ మాట్లాడుతూ ఈ సర్వే ఎప్రిల్ ఒకటవ తేదీ నుంచి ప్రారంభం కానుందని, బిఎల్ఓ లు ఇంటికి వచ్చి ఇంటి యజమాని నుంచి సమాచారం తీసుకొని వివరాలను నమోదు చేస్తారని విరికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. సవరణతో పాటు కొత్తగా ఓటరు నమోదు దరఖాస్తులు తీసుకుంటారన్నారు,ఈ కార్యక్రమంలో శిక్షకుడు అందె సుధాకర్, డిప్యూటీ తహశీల్దార్ పద్మజా, ఆర్ఐ అశోక్, జిపిఓలు, బిఎల్ఓలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలని జీసీడీవో ఆదేశం



**తరిగొప్పుల మర్చి 26 ప్రజాజ్యోతి** తరిగొప్పుల మండలంలోని పిఎంశ్రీ జడ్పీ హెచ్ఎస్ ఉన్నత పాఠశాలను జీసీడీవో గౌసియా బేగం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, నీటి సౌకర్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంటపాత్రలు మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే పాఠశాలలోని పలు రికార్డులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు పాలెపు విజయ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## దాడి చేసి దోచుకున్న గ్యాంగ్‌కు జైలుశిక్ష

- **- పర్వతగిరిలో డాకాయితీ కేసులో ఐదుగురికి 5 ఏళ్ల జైలు శిక్ష..రూ.2,000 జరిమానా విధించిన కోర్టు**

**పర్వతగిరి, మార్చి 26 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన డాకాయితీ కేసులో న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఐదుగురు నిందితులను దోషులుగా తేల్చి, ప్రతి ఒక్కరికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. పర్వతగిరి గ్రామానికి చెందిన మట్ట మల్లేశం (తండ్రి: వెంకటయ్య) 2019లో జరిగిన ఘటనలో నిందితులు గుంపుగా ఏర్పడి బాధితుడిపై దాడి చేసి రూ.3,000 నగదు, బంగారు ఉంగరం, సాంసంగ్ మొబైల్ ఫోన్‌ను బలవంతంగా గుంజుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో గువ్వల శివ (22), అరికల శ్రీవర్ధన్ (20), చాగంటి వంశీ, దోమల రాజు (22), ఎర్ర కార్తీక్ (20).సాక్ష్యాధారాలు, వాంగ్మూలాలను పరిశీలించిన న్యాయస్థానం నిందితులను దోషులుగా నిర్ధారించి శిక్ష విధించింది.

ఈ కేసులో నిందితులకు శిక్ష పడే విధంగా దర్యాప్తు, కోర్టు ట్రయల్‌ను సమర్థవంతంగా నడిపినందుకు పర్వతగిరి కోర్టు కానిస్టేబుల్ రాజు, ఎస్సై బి. ప్రవీణ్, సీఐ బి. రాజగోపాల్‌ల పనితీరును ఉన్నతాధికారులు మామునూర్ ఏసీపీ, ఈస్ట్ జోన్ డీసీపీ, వరంగల్ సీపీ ప్రత్యేకంగా ప్రశంసించినట్లు సమాచారం.

## గురిజాల గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభం

- మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్.



**నర్సంపేట మార్చి 26 (ప్రజా జ్యోతి )** నర్సంపేట మండలం గురిజాల గ్రామంలో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఆదేశానుసరం గ్రామ సర్పంచ్ బండారి చందర్ రావు ఆధ్వర్యంలో 15 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్డు నిర్మాణ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన సర్పంచ్ బండారి చందర్ రావు గ్రామ పార్టీ అధ్యక్షులు సిరపురపు నర్సయ్య,మండల పార్టీ అధ్యక్షులు కత్తి కిరణ్,ప్రధాన కార్యదర్శి గజ్జి రాజు, ఉపాధ్యక్షులు దౌడు భాస్కర్ ఆత్మ జిల్లా డైరెక్టర్ గుర్రం అచ్చయ్య,మార్కెట్ కమిటీ డైరెక్టర్ డక్కి శ్రీనివాస్ మండల పార్టీ మహిళా అధ్యక్షులు సూరం సాంబలక్ష్మి,గ్రామ పార్టీ ఉపాధ్యక్షులు గడ్డం శ్రీనివాస్,కార్యదర్శి మెట్టు రమేష్, ఉపసర్పంచ్ కారు సారయ్య,వార్డ్ మెంబర్లు మెట్టు సుమలత, బండారి రాజేందర్, నర్ర రవి చిన్న పెల్లి అరుణ,సిరపురపు మహేష్ అల్లి అనిల్,వేముల విజయ్ వెంకటేశ్వర్లు, భద్రయ్య, నాగయ్య, రాజు, లింగమూర్తి, శ్రీకాంత్,సదానందం, నరేందర్, అరుణ్ పంచాయతీ కార్యదర్శి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల రగోతం రావు కుటుంబాన్ని పరామర్శ

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**రాయపర్తి మార్చి 26 ప్రజా జ్యోతి**రాయపర్తి మండల కేంద్రనికి చెందిన బీ ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల రగోత్తంరావు సతీమణి మాధవి ఇటీవల అనారోగ్యంతో మరణించగా గురువారం వరంగల్ లోనీ వారి స్వగృహంలో కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించినరాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు .ఈ కార్యక్రమంలో వారి వెంట మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మండల పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారూ.

## నర్సంపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు ఎగ్జిక్యూటివ్ బాడీ ఎన్నిక

- అధ్యక్షులుగా సిలువేరి కిరణ్ కుమార్



**నర్సంపేట మార్చి 26 (ప్రజా జ్యోతి )** నర్సంపేట బార్ అసోసియేషన్‌కు సంబంధించిన 2026–27 సంవత్సరానికి గాను జరిగిన ఎన్నికల్లో ఎగ్జిక్యూటివ్ బాడీని విజయవంతంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికల్లో సభ్యులు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించారు.ఈ సందర్భంగా విజేతల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.అధ్యక్షులుగా సిలివేరు కిరణ్ కుమార్ భారీ మెజారిటీతో ఎన్నికయ్యారు.జనరల్ సెక్రటరీగా అంబటి రాజ్ కుమార్ గెలుపొందారు.వైస్ ప్రెసిడెంట్ గా కోడిదెల సాత్విక ఎన్నికయ్యారు.జాయింట్ సెక్రటరీగా మొహమ్మద్ రఫీ విజయం సాధించారు.ట్రెజరర్‌గా బొడ్డుపల్లి అజయ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ,వారు బార్ అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

### సంగెం పోలీస్ స్టేషన్‌లో సిపి పర్యటన..

# శాంతిభద్రతలపై సిపి ఆరా..!

- స్టేషన్ డైరీ నుంచి లాకప్ రూమ్ వరకు..సిపి క్షేత్ర స్థాయి పరిశీలన.
- నేర నియంత్రణే లక్ష్యం:పోలీస్ స్టేషన్‌లో సిపి సమీక్ష
- ప్రజలకు అందుబాటులో ఉండాలి: పోలీస్ స్టేషన్ తనిఖీలో సిపి ఆదేశం





**సంగెం,మార్చి26(ప్రజాజ్యోతి):** ప్రజల సమస్యల పరిష్కారమే పోలీసుల ప్రాథమిక బాధ్యత అని,పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తికి గౌరవం దక్కాలని వరంగల్ సీపి సన్ ప్రీత్ సింగ్ సంగెం(SHO)ను ఆదేశించారు.గురువారం రోజున సంగెం పోలీస్ స్టేషన్ కు వరంగల్ జిల్లా పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ చేరుకోగా స్థానిక ఎస్సై వంశీకృష్ణ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణంలో మామిడి మొక్క నాటి చుట్టు తిరిగి ఎస్సైని అభినందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..రాత్రిపూట పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని,అనుమానిత వ్యక్తుల పై నిఘా ఉంచాలని అన్నారు.పెండింగ్‌లో ఉన్న పాత కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.మహిళల ఫిర్యాదుల పై తక్షణమే స్పందించాలని,షీ టీమ్స్‌తో సమన్వయం చేసుకుంటూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు.స్టేషన్‌లోని క్రైమ్ రిజిస్టర్లు,లాకప్ రూమ్ ఆయుధాగారాన్ని సీపీ పరిశీలించారు.చార్జ్ షీట్లు దాఖలు చేయడంలో ఆలస్యం కాకూడదని ఆదేశించారు.ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ మాట్లాడుతూ.సీసీటీవీ నెట్‌వర్క్‌ను నిరంతరం పర్యవేక్షించాలని,నేరగాళ్లను పట్టుకోవడంలో సాంకేతికతను వాడాలని స్పష్టం చేశారు.నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అధికారులకు దిశానిర్దేశం చేశారు.రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మామునూర్ ఏసీపీ వెంకటేష్,పర్వతగిరి సిఐ రాజగోపాల్,ఎస్సై వంశీకృష్ణ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొడకండ్లలో మినీ టెక్స్టైల్ పార్క్ కు అనుమతులు ఇచ్చి నిధులు కేటాయించండి

- అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి హర్షం వ్యక్తం చేసిన ప్రజలు



**కొడకండ్ల, మార్చి 26 ( ప్రజాజ్యోతి ):** కొడకండ్ల మండల కేంద్రంలో మినీ టెక్స్టైల్ పార్కు కు అనుమతులు ఇచ్చి నిధులు మంజూరు చేయాలని గురువారం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అసెంబ్లీ సమావేశంలో స్పీకర్ ద్వారా సంబంధిత మంత్రిని కోరారు. గతంలో టెక్స్టైల్ పార్క్ పేరుతో ఎలక్షన్ల ముందు ఎలాంటి పరిపాలన అనుమతులు లేకుండా ఆదరాబాదరాగా శంకుస్థాపన చేశారని, ఎలాంటి అనుమతులు నిధులు మంజూరు చేయలేదని తెలిపారు. ఎన్నికల అనంతరం టెక్స్టైల్ పార్కు గురించి అధికారుల నుండి వివరాలు తీసుకోగా ఎలాంటి పరిపాలన అనుమతులు లేవని, ఎన్నికల ముందు హడావిడిగా శంకుస్థాపన చేసినట్లు తెలిసిందని తెలిపారు. కొడకండ్ల, దేవరుప్పుల, మండలాలతో పాటు చుట్టుపక్కల మండలాలు, గ్రామాలలో పద్మశాలీలు, చేనేత కార్మికులు అధిక సంఖ్యలో ఉన్నారని వీరంతా ఉపాధి కోసం, సూరత్ బొంబాయి లాంటి ప్రదేశాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. కొడకండ్లలో వివిధ రకాల వస్త్రాల తయారీతోపాటు, దేవరుప్పుల మండలంలో ఇక్కత్ చీరలు నేస్తారని, వీటిని హైదరాబాద్ తో పాటు వివిధ నగరాలలో విక్రయిస్తారని తెలిపారు. కొడకండ్లలో మినీ టెక్స్టైల్ పార్క్ ఏర్పాటు చేయడం వలన చాలామందికి ఉపాధి లభిస్తుందని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే వారికి ఇక్కడే ఉపాధి తో పాటు ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. అంతేకాకుండా జనగామ జిల్లాలో అందరికీ ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. మినీ టెక్స్టైల్ పార్కు గురించి ఎమ్మెల్యే యశస్వి రెడ్డి అసెంబ్లీలో సంబంధిత మంత్రిని కోరటం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ఒగ్గు కథ కళాసామ్రాట్ చుక్క సత్తయ్య కుమారుడు చుక్క అంజయ్య కన్నుమూత



**లింగాల గణపురం, మార్చ్, 26 (ప్రజాజ్యోతి):** –మండలంలోని మాణిక్యపురం గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వర్గీయ చుక్క సత్తయ్య (చౌదర్పల్లి సత్తయ్య) పెద్ద కుమారుడు చుక్క అంజయ్య (చౌదర్పల్లి అంజయ్య) (55 ) గురువారం వ్యవసాయ బావి వద్ద గుండె నొప్పితో కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా వైద్యులు మరణించాడని నిర్ధారించారు. మృతుడు అంజయ్యకు భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు పిల్లల పేర్లు పెద్ద కుమార్తె బండిక కవిత, రెండవ కుమార్తె కృష్ణవేణి, మూడవ కుమార్తె సరిత ఉన్నారు. అంజయ్య తండ్రి చుక్క సత్తయ్య కళాబృందంలో కీలక పాత్ర పోషించేవాడు. అంజయ్య ఒగ్గు కథలు చెబుతూ జీవనం కొనసాగించేవాడని, తండ్రి సుక్క సత్తయ్య నుండి కలను అందిపిచ్చుకున్న అంజయ్య తండ్రి ఆశయాలను కొనసాగించాలనే సంకల్పంతో ఒగ్గుకలను పోషించారు. తండ్రి చుక్క సత్తయ్య దేశంలోనే ఒగ్గు కథను పరిచయం చేసిన వ్యక్తిగా పద్మశ్రీ అవార్డుతో పాటు ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న వ్యక్తిగా మారుమూల గ్రామంలో జన్మించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన వ్యక్తి కాగా, వారి అడుగుజాడల్లో వారి కుమారులు మేము ఒగ్గు కథ నే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నామని అంజయ్య మృతి ఒగ్గు కథకు మా కుటుంబానికి తీరని లోటని చుక్క సత్తయ్య రెండవ కుమారుడు చుక్క శ్రీశైలం విలపించాడు చౌదరిపల్లి అంజయ్య (చుక్క) మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.స్టేషన్ గన్ పూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పార్థిక దేవానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# మల్లూరు ఆలయ అభివృద్ధిపై మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి

- భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర





**మంగపేట మార్చి 26 (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధిపై మాస్టర్ ప్లాన్ వెంటనే సిద్ధం చేయాలని, స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ దివాకర సందర్శించి అభివృద్ధి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి దర్శనం కోసం అనేక మంది భక్తులు వస్తుంటారని, వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల వసతులు సౌలభ్యాలు ఆలయ అభివృద్ధిపై వెంటనే మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.ప్రధాన ఆర్చీ నిర్మాణం, రోడ్డు విస్తరణ, కళ్యాణకట్ట, కళ్యాణ మండపం, పార్కింగ్ స్థలాల ఏర్పాటు, ఇతర ఆలయ అభివృద్ధి పనులపై త్వరితగతిన నివేదికలు రూపొందించాలని పేర్కొన్నారు.ఆచార సాంప్రదాయాలకు ఆటంకం కలగకుండా ఆలయంను అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్కిటెక్ బృందం, దేవాదాయ శాఖ డిఈ రమేష్ బాబు, తహశీల్దార్ తోట రవీందర్, ఆలయ ఈఓ మహేష్, ఎంపీ డిఓ బద్రు నాయక్, ఆలయ అర్చకులు, సంబంధిత అధికారులు, స్థానిక గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాత్రూంలో జారి గాయపడి వ్యక్తి మృతి

- అవయవ దానం చేసి మానవత్వం చాటిన కుటుంబం



**వరంగల్ సిటీ, మార్చి 26 (ప్రజా జ్యోతి):** నగరంలోని గిర్మాజీపేట గోవిందరాజుల గుట్ట ప్రాంతానికి చెందిన పోలేపాక రాజు (34) బాత్రూంలో జారిపడి తలకు తీవ్రంగా గాయమైంది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం బ్రెయిన్ డెడ్ అయ్యి మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ విషాద ఘటనలోనూ ఆ వ్యక్తి కుటుంబ సభ్యులు గొప్ప మనసుతో ముందుకు వచ్చి ఆయన అవయవాలను దానం చేసి మానవత్వాన్ని చాటారు. కుటుంబ సభ్యుల సమ్మతితో మృతుని అవయవాలను హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి అందించారు. అత్యవసర సమయంలో అవసరమైన రోగులకు అమర్చేందుకు వైద్యులు చర్యలు చేపట్టారు. ఈ అవయవ దానం ద్వారా పలువురు రోగులకు కొత్త జీవం లభించే అవకాశం ఉందని వైద్యులు తెలిపారు. అత్యంత దుఃఖ సమయంలోనూ ఇతరులకు ప్రాణాలు ఇవ్వాలనే సంకల్పంతో అవయవ దానం చేసిన కుటుంబాన్ని వైద్యులు, సిబ్బంది అభినందించారు.

## మద్యం సేవించి వాహనం నడపరాదు

- ఎస్సై ఎం. సురేష్

**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (మార్చి 26)** మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరుగుతుందని ఎస్సై సురేష్ అన్నారు. గురువారం మండలంలోని ఇప్పలపల్లి గ్రామపంచాయతీ వద్ద పోలీసు సిబ్బందితో కలిసి ఎస్సై డ్రంక్ అండ్ డ్రైవ్ అంశంపై అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మద్యం సేవించి వాహనం నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, ప్రాణనష్టం, చట్టపరమైన చర్యల గురించి వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌ను నియంత్రించేందుకు పి.ఎస్ పరిధిలో ప్రత్యేక డ్రైవులు క్రమం తప్పకుండ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని, తమతో పాటు ఇతరుల భద్రతను కాపాడాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమం ద్వారా ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందుతుందని ఎస్సై తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## 4వ తరగతి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

- ములుగు జిల్లా కేంద్రంలోని టిఎన్జీఓస్ యూనియన్ భవనంలో ఆవిష్కరణ



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా కేంద్రంలోని టిఎన్జీఓస్భవనంలో టిఎన్జీఓస్ యూనియన్ ములుగు జిల్లా అధ్యక్షుడు పోలు రాజు,జిల్లా కార్యదర్శి మేడి చైతన్య ఆధ్వర్యంలో 4వ తరగతి ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 4వ తరగతి ఉద్యోగుల సంఘం అద్యక్షుడు రమేష్ కార్యదర్శి ఆగయ్య ఆధక్షతన ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమానికి టిఎన్జీఓస్ 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.దాస్య నాయక్,భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు పి.శంకరయ్య ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో టిఎన్జీఓస్ యూనియన్ అనుబంధం 4వ తరగతి ఉద్యోగుల సంఘం ప్రాథమిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు





**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా కోర్టు ఆవరణలో గురువారం జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి.జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాలుగు చంద్రయ్య,కోశాధికారిగా బానోత్ స్వామిదాస్ లు ఎన్నికయ్యారు.అధ్యక్షుడు,కోశాధికారి పదవికి ఎన్నికలు జరిగాయి.మొత్తం 37 ఓట్లు పోలవ్వగా అధ్యక్షుడు బాలుగు చంద్రయ్యకు 21 ఓట్లు రాగ,సారంగపాణికి 16 ఓట్లు వచ్చాయి.కోశాధికారి పదవికి బానోత్ స్వామిదాస్ కు 24ఓట్లు రాగ,రాజేందర్ కు13ఓట్లు వచ్చాయి.బానోత్ స్వామిదాస్ వరసగా మూడవసారి కోశాధికారి ఎన్నికయ్యారు.ఏకగ్రీవంగా ఎన్నికైనా వాటిలో ప్రధాన కార్యదర్శిగా కొండి రవీందర్, ఉపాధ్యక్షుడిగా రంగోజు బిక్ష పతి,జాయింట్ సెక్రటరీగా రాచర్ల రాజ్ కుమార్,లేడీ జాయింట్ సెక్రటరీగా బి. నవత,ఈసి మెంబర్లుగా రంగోజు సూర్యం,ఎండీ. మన్సూర్ అలీ,జి.అరుణ్ కుమార్,డి.సంజీవ,సుదర్శన్, పి.అర్చన,కె.సుస్మితలను ఎన్నుకోవడం జరిగింది.

## తైబజార్ వేలం మరోసారి వాయిదా



**పర్వతగిరి, మార్చి 26 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామపంచాయతీ పరిధిలో తైబజార్ 2026–27 సంవత్సరానికి సంబంధించిన బహిరంగ వేలం రెండోసారి నిర్వహించినప్పటికీ ఆశించిన సర్కారీ ధర రాకపోవడంతో వాయిదా వేయబడింది.గ్రామ సర్పంచ్ గాడిపెల్లి మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ వేలంలో సరైన ధర రాకపోవడంతో, తదుపరి వేలాన్ని మార్చి 28 శనివారం మధ్యాహ్నం 3.00 గంటలకు నిర్వహించనున్నట్లు మండల పంచాయితీ అధికారి శేషంజాన్ స్వామి తెలిపారు.ఈ వేలంలో ఆసక్తి గల వ్యక్తులు పాల్గొనాలని అధికారులు సూచించారు.

## భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయాలి




**వరంగల్ కలెక్టరేట్ మార్చి 26 (ప్రజా జ్యోతి):** దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూసేకరణ పురోగతి పై సమీక్ష దేవాదుల జె. చొక్కారావు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు సంబంధించిన భూసేకరణ పురోగతిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని నర్సంపేట, దుగ్గొండి, రాయపర్తి, వర్ధన్నపేట, నల్లబెల్లి మండలాల్లో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, ముందస్తు నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రాజెక్ట్ అమలు సజావుగా కొనసాగేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యారాణి, ఆర్డీఓలు సుమ, ఉమారాణి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలలో పఠనోత్సవం.. విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి పెంపు




**పర్వతగిరి, మార్చి 26 (ప్రజాజ్యోతి)** ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా పాఠశాల స్థాయిలో గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో ఓపెనింగ్ రీడింగ్ రూమ్, బుక్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పర్వతగిరి పాఠశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి హాజరై విద్యార్థుల పఠన శక్తిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠన అలవాట్లు పెంపొందించడం ద్వారా వారి సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు ఏర్పడతాయని తెలిపారు. పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానం పెరగడమే కాకుండా వ్యక్తిత్వ వికాసం కూడా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండా నవీన్ కుమార్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో చదివే అలవాటును పెంపొందించాల్సిన అవసరం ఉందని, అందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన గ్రంథాలయ ఇన్‌చార్జ్ డి. రాధాకృష్ణకుమారి, బి. రేఖ లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐ ని కలిసిన శ్రీ వినాయక శ్రీనివాస వెల్ఫేర్ సొసైటీ




**గణపురం ప్రజాజ్యోతి మార్చి 26** గణపురం మండలం చెల్పూర్ బస్టాండ్‌లోని శ్రీ వినాయక శ్రీనివాస వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ బొరగల అశోక్ ను గురువారం ఘనంగా సన్మానించారు. అదేవిధంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జాతీయ సేవా రత్న అవార్డు గ్రహీత దుంప నర్సయ్యను ఎస్ఐ చేతుల మీదుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు అయిత రమేష్ అధ్యక్షులు పుట్టపాక కిరణ్ ఉపాధ్యక్షులు మూదురు కొల్ల రమేష్, ఎడ్ల శ్రీనివాస్, ముప్పిడోజు శ్రీనివాస్, చక్రపు వెంకటేశ్వర్లు వర్కింగ్ ప్రెసిడెంట్ అవుల శంకర్ క్యాషియర్ పాత రవీందర్ సహాయ కార్యదర్శులు కె. హైగ్రీవ చారి, పట్టెం బ్రహ్మయ్య ప్రచార కార్యదర్శి కునారపు రఘు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**ఖానాపురం /మార్చి: 26 (ప్రజా జ్యోతి)** ఖానాపురం మండలం అయోధ్య నగర్ పరిధిలోని గంగదేవి తండాకు చెందిన బానోతు వీరన్న ఇటీవల అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. బాధితుడికి మంజూరైన రూ. 19 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎర్ర వరదరాజు ఆధ్వర్యంలో అందజేశారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం లాంటిదని వరదరాజు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా తనకు సహాయం అందించిన నర్సంపేట శాసనసభ్యుడు మాధవరెడ్డి, మండల, గ్రామ పార్టీ నాయకులకు బాధితుడు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ ఉపసర్పంచ్ బానోత్ మల్లేష్, కాంగ్రెస్ వార్డు సభ్యులు తేజవత్ రాజు, కొంతం రాజు, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్, ప్రధాన కార్యదర్శి కదుతూరి రాజు, పెండ్లి రాజు, ఎర్ర లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 28న మల్టీస్పెషల్టీ మెగా హెల్త్ వైద్య శిబిరం

- వైద్యాధికారిణి నాగరాణి

**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (మార్చి 26)** ఈ నెల 28 న మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మల్టీ స్పెషల్టీ మెగా హెల్త్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి నాగరాణి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన–ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు రావడానికి రేపు ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు మల్టీ స్పెషలిటీ మెగా హెల్త్ వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో డెంటల్, ఆప్తలిమిక్, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, గైనిక్ సంబంధిత వైద్య నిపుణులు రానున్నట్లు తెలిపారు. 1.స్త్రీ వైద్య నిపుణులు (గైనకాలజిస్ట్):–మహిళా ఆరోగ్య సమస్యలు మరియు గర్భిణీ స్త్రీలకు పరీక్షలు చేయబడును. 2.ఎముకల వ్యాధి నిపుణులు (ఆర్థోపెడిక్):–కీళ్ల నొప్పులు ఎముకల బలహీనత వంటి సమస్యలకు చికిత్స అందజేస్తారు. 3.MD జనరల్ మెడిసిన్:–అన్ని రకాల జబ్బులకు పరీక్ష చేయబడును. 4.నేత్ర వైద్య నిపుణులు (ENT):–కంటి చూపు సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేయబడును. 5.పిల్లల వైద్య నిపుణులు (పీడియాట్రిక్):–చిన్నపిల్లలకి ఆరోగ్య సమస్యలు గుర్చి చికిత్స చేయబడును. 6.దంత వైద్య నిపుణులు (డెంటల్):–పంటి సమస్యలు ఉన్న వారికి పరీక్ష చేయబడును. ఈ ప్రత్యేక వైద్య శిబిరంలో నిపుణులైన డాక్టర్లు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారని కావునా మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, మహిళలు, వృద్ధులు చిన్నపిల్లలు, కంటి సమస్యలు ఉన్నవారు, పంటి సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మరో స్వరం మూగబోయింది

- దివికేగిన చుక్క అంజయ్య
- గుండెపోటుతో వ్యవసాయ బావి వద్ద కన్నుమూత
- ఒగ్గు కథ కళాసామ్రాట్ చుక్క సత్తయ్య కుమారుడు చుక్క అంజయ్య మృతి






**లింగాల గణపురం (జనగామ), మార్చి 26 (ప్రజాజ్యోతి):** మరో స్వరం మూగబోయింది. ప్రఖ్యాతి గాంచిన ఒగ్గు కళాకారుడి గొంతు ఒక్కసారిగా ఆగిపోయింది. తెల్లారిన వెంటనే గుండెపోటు రూపంలో తన ఆశలపై నీళ్ళు జల్లుతూ బ్రతుకును చీకటిలోకి నెట్టింది. ఎన్నో కథలకు తనదైన రూపంలో జీవం పోసిన చౌదర్పల్లి సత్తయ్య మనలో ఇక లేరన్న వార్త జీర్ణించుకోలేని పరిస్థితి.. తన బంధువులను శోకసంద్రంలో ముంచింది. జనగామ జిల్లా లింగాల గణపురం మండలం లోని మాణిక్యపురం గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వర్గీయ చుక్క సత్తయ్య (చౌదర్పల్లి సత్తయ్య) పెద్ద కుమారుడు చుక్క అంజయ్య (చౌదర్పల్లి అంజయ్య) (55) గురువారం వ్యవసాయ బావి వద్ద గుండె నొప్పితో కుప్పకూలిపోయాడు. విషయం తెలుసు కున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా వైద్యులు మరణించాడని నిర్ధారించారు. మృతుడు అంజయ్యకు భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు పిల్లల పేర్లు పెద్ద కుమార్తె బండిక కవిత, రెండవ కుమార్తె కృష్ణవేణి, మూడవ కుమార్తె సరిత ఉన్నారు. అంజయ్య తండ్రి చుక్క సత్తయ్య కళాబృందంలో కీలక పాత్ర పోషించేవాడు. అంజయ్య ఒగ్గు కథలు చెబుతూ జీవనం కొనసాగించేవాడని, తండ్రి సుక్క సత్తయ్య నుండి కలను అందిపుచ్చుకున్న అంజయ్య తండ్రి ఆశయాలను కొనసాగించాలనే సంకల్పంతో ఒగ్గుకలను పోషించారు. తండ్రి చుక్క సత్తయ్య దేశంలోనే ఒగ్గు కథను పరిచయం చేసిన వ్యక్తిగా పద్మశ్రీ అవార్డుతో పాటు ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న వ్యక్తిగా మారుమూల గ్రామంలో జన్మించి దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిన వ్యక్తి కాగా, వారి అడుగుజాడల్లో వారి కుమారులు మేము ఒగ్గు కథ నే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నామని అంజయ్య మృతి ఒగ్గు కథకు మా కుటుంబానికి తీరని లోటని చుక్క సత్తయ్య రెండవ కుమారుడు చుక్క శ్రీశైలం విలపించాడు చౌదరిపల్లి అంజయ్య (చుక్క) మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చౌదరిపల్లి అంజయ్య పార్థిక దేవానికి స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చౌదరిపల్లి అంజయ్య మృతికి ప్రముఖులు, బంధువులు, తదితరులు ప్రగాఢ సానుభూతి తెలిపి నివాళులర్పించారు.

# జిల్లాలో డిజిటల్ పాలనను సమర్థమంతంగా అమలు చేయాలి

- గ్యాస్ సరఫరా, ఇసుక తరలింపు, తాగునీటి సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 26 (ప్రజాజ్యోతి) :** జిల్లాలో డిజిటల్ పాలనను మరింత సమర్థమంతంగా అమలు చేసేందుకు గాను జిల్లా స్థాయి ఐటీ మానిటరింగ్ సెల్ ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ఎన్ఐసీ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఐటీ మానిటరింగ్ సెల్ ను అదనపు కలెక్టర్ రెవెన్యూ బెనాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రిబ్బన్ కత్తిరించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "డిస్ట్రిక్ట్ లెవెల్ ఐటి మానిటరింగ్ సెల్ – జనగాం డిస్ట్రిక్ట్" పేరిట ప్రారంభమైన ఈ కేంద్రం ద్వారా వివిధ ప్రభుత్వ పథకాల అమలు, సేవల పంపిణీ, డేటా నిర్వహణలో పారదర్శకత, వేగం పెరుగుతాయని వెల్లడించారు. ఈ ఐటీ మానిటరింగ్ సెల్ ద్వారా ఈ–గవర్నెన్స్ పరిష్కారాలు, పథకాల మానిటరింగ్ & ట్రాకింగ్ – ప్రభుత్వ పథకాల అమలును సమగ్రంగా పర్యవేక్షించడం, నెట్‌వర్క్ కనెక్టివిటీ, డేటా మానిటరింగ్, విశ్లేషణ, పారదర్శకత, ఆవిష్కరణలు – సేవల్లో పారదర్శకతతో పాటు సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ప్రజా సేవలు, మద్దతు – ప్రజలకు వేగవంతమైన, సమర్థమంతమైన సేవలు అందించడం, వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని వివరించారు. ఈ కేంద్రం ద్వారా ప్రభుత్వ శాఖల పనితీరు మెరుగుపడటంతో పాటు, ప్రజలకు అందించే సేవల నాణ్యత పెరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే డిజిటల్ గవర్నెన్స్ ద్వారా సమయం, వనరుల వినియోగం మెరుగై పారదర్శక పరిపాలన సాధ్యమవుతుందన్నారు. "సమర్థత, పారదర్శకత ద్వారా డిజిటల్ గవర్నెన్స్‌ను శక్తిమంతం చేయడం" అనే లక్ష్యంతో ఈ ఐటీ మానిటరింగ్ సెల్ పనిచేస్తుందని తెలిపారు. అనంతరం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ప్రజలకు వివిధ రకాల సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ సేవా కేంద్రాన్ని రిబ్బన్ కత్తిరించి, ఆరంభించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు అవసరమైన ముఖ్య సేవలు అంతరాయం లేకుండా అందించేందుకు జిల్లా పరిపాలన కీలక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రధానంగా గ్యాస్ సరఫరా, ఇసుక తరలింపు, తాగునీటి సమస్యలపై వెంటనే స్పందించేందుకు టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి, తక్షణ పరిష్కారం కోసం 1800 425 6605 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఎల్పీజీ గ్యాస్ సేవలు: గ్యాస్ బుకింగ్ సమస్యలు, రీఫిల్ ఆలస్యం, భద్రతా అంశాలు, సేవల లోపాలపై ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చు. నీటి సరఫరా సేవలు: పైప్‌లైన్ లీకేజీలు, తక్కువ ఒత్తిడి, నీటి కలుషితం, అసమాన సరఫరా వంటి సమస్యలను తెలియజేయవచ్చు. ఈ టోల్ ఫ్రీ నంబర్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖలకు వెంటనే పంపించి, వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఫణి కుమార్, ఈడీఎం గౌతమ్, ఇతర సంబంధిత అధికారులు, ఐటీ సిబ్బంది పాల్గొన్నారు.

# వయోవృద్ధుల ఉచిత ఆరోగ్య శిబిరం

- ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి డాక్టర్ పి.సరోజ





**చెన్నారావుపేట మార్చి 26 (ప్రజా జ్యోతి)** చెన్నారావుపేట మండల కేంద్రంలోని శివాలయ ప్రాంగణంలో గురువారం మండల వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ప్రతి నెల మొదటి గురువారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఈ నెల కూడా వృద్ధులకు మహిళలకు ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ పి.సరోజ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ సరోజ మాట్లాడుతూ.. వృద్ధులు తమ ఆరోగ్యం పట్ల నిరంతరం జాగరూకతతో ఉండాలని సూచించారు. వయసు రీత్యా వచ్చే మార్పులను గమనిస్తూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల దీర్ఘకాలిక సమస్యలను నివారించవచ్చని తెలిపారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు తమ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య బృందం సభ్యులు సి హెచ్ ఓ భద్రయ్య, హెచ్ ఇ వసంత,వయోవృద్ధుల సంఘం మండల అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య కవి, మాజీ జెడ్పీటీసీ జున్నుతుల రాంరెడ్డి, వరంగంటి మల్లయ్య, కుమారస్వామి, రామెల్, నామని సురేందర్, సార్యా, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# అతివేగం వద్దు.. ప్రాణాలు కోల్పోవద్దు

- నెక్కొండ సిఐ శ్రీనివాస్




**చెన్నారావుపేట మార్చి 26 (ప్రజా జ్యోతి)** వాహనదారులు అతివేగాన్ని నియంత్రించుకుని ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని నెక్కొండ సిఐ శ్రీనివాస్ సూచించారు.చెన్నారావుపేట మండలం ఖాదర్‌పేట శివారులోని ప్రమాదకరమైన మూలమలుపు వద్ద పోలీసుల ఆధ్వర్యంలో గురువారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఖాదర్‌పేట శివారులోని ఈ మలుపు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించామని తెలిపారు. వాహనదారులను అప్రమత్తం చేసేందుకు భవిష్యత్తులో ప్రాణనష్టం జరగకుండా నివారించేందుకు ఈ సూచిక బోర్డును ఏర్పాటు చేసినట్లు వివరించారు. ముఖ్యంగా మలుపుల వద్ద వేగాన్ని తగ్గించి నిదానంగా వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రాజేష్ రెడ్డి, ఏఎస్ఐ లక్ష్మణ్ మూర్తి,పోలీస్ సిబ్బంది, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జాయింట్ సెక్రటరీ గా కిరణ్ గౌడ్



**ప్రజాజ్యోతి –మొగుళ్ళ పల్లి (మార్చి 26)** తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ డివిజన్ జాయింట్ యాక్షన్ కమిటీ సెక్రెటరీగా మండల కేంద్రానికి చెందిన వేముల కిరణ్ గౌడ్ నియమితులయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన యూనియన్ సమ్మెలో భాగంగా ఆయనను నియమించినట్లు యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వేముల కిరణ్ గౌడ్ మాట్లాడారు. తనపై నమ్మకంతో ఈ బృహత్తరమైన బాధ్యతలను అప్పగించిన యూనియన్ నాయకుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని తెలిపారు.

# ఆకేరువాగు ఇసుక ఫిల్టర్ జీవనోపాధిపై ప్రత్యేక పాలసీ అవసరం.

- అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే నాగరాజు.



**వర్ధన్నపేట మార్చి 26, ప్రజా జ్యోతి.** వరంగల్ జిల్లా, వర్ధన్నపేట నియోజకవర్గంలో ప్రవహించే ఆకేరువాగు పరిధిలో ఇసుక ఫిల్టర్ పనులపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పాలసీ తీసుకురావాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కోరారు. ఆకేరువాగు మహబూబాబాద్ జిల్లా నుంచి ప్రవహిస్తూ ఐనవోలు, వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల మీదుగా వెళ్లి గోదావరిలో కలుస్తుందని ఆయన తెలిపారు. ఈ వాగులో సహజంగా ఇసుక లేకపోయినా, వర్షాకాలంలో వాగు సమీపంలోని పొలాల్లో పేరుకుపోయే మట్టి, ఇసుకను ఫిల్టర్ చేసి విక్రయించడం ద్వారా సుమారు 5,000 కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నాయని వివరించారు.

ఈ ఫిల్టర్ చేసిన ఇసుకను ఇళ్ల నిర్మాణానికి కాకుండా, టైల్స్ కింద వేయడం, బాత్రూంల నిర్మాణం వంటి ఇతర పనులకు వినియోగిస్తున్నారని తెలిపారు. ఒక ట్రాక్టర్ ఇసుక అమ్మితే సుమారు వెయ్యి రూపాయలు ఆదాయం వస్తుందని, ముఖ్యంగా దళితులు, ఎస్టీలు, బీసీలు ఫైనాన్స్ ద్వారా ట్రాక్టర్లు తీసుకొని ఈ పనిపై ఆధారపడి ఉన్నారని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక పాలసీలో ఈ ఫిల్టర్ ఇసుక కార్యకలాపాలు చేరకపోవడంతో ఈ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, రోడ్లపై ధర్నాలు కూడా చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఇసుక దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం మంచి చర్యలు తీసుకున్నప్పటికీ, ఈ వర్గం జీవనోపాధిని కూడా దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామపంచాయతీకి రాయల్టీ చెల్లించే విధంగా అనుమతులు ఇస్తే గ్రామ పంచాయతీలకు ఆదాయం పెరుగుతుందని, ప్రజలు తమ సొంత భూముల్లో నుంచే ఫిల్టర్ చేసి మట్టి, ఇసుక విక్రయించగలరని తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి, తగిన విధానాన్ని తీసుకువస్తే వేలాది కుటుంబాలు తిరిగి తమ జీవనోపాధిని కొనసాగించగలవని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు సహకారం అందించాలి: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 26 (ప్రజాజ్యోతి) ::** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. గురువారం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఎస్ఐఆర్ ప్రక్రియ పై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా పూర్తిచేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే సమర్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు మ్యాపింగ్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేందుకు, రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. త్వరలో నిర్వహించబోవు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ గూర్చి ఎలక్షన్ సూపరింటెండెంట్ రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. ఇందులో భాగంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు, జిల్లాలోని వారి పరిధిలో గల బూత్ లలో ప్రతి ఇంటింటికి వస్తారని వారితో ఒక జత ఎనుమరేషన్ ఫారంని తీసుకువచ్చి ప్రతి ఓటరు వివరాలు అడిగి తెలుసుకుని వాటిని తగు సమాచారంతో నింపి, ఒక ప్రతిని వారి వెంట తీసుకొని మరొక ప్రతిని ఓటరుకు అందజేస్తారన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీధర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల ఉచిత ఆరోగ్య శిబిరం

- ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలి డాక్టర్ పి.సరోజ



**చెన్నారావుపేట మార్చి 26 (ప్రజా జ్యోతి)** చెన్నారావుపేట మండల కేంద్రంలోని శివాలయ ప్రాంగణంలో గురువారం మండల వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ప్రతి నెల మొదటి గురువారం నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఈ నెల కూడా వృద్ధులకు మహిళలకు ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ పి.సరోజ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ సరోజ మాట్లాడుతూ.. వృద్ధులు తమ ఆరోగ్యం పట్ల నిరంతరం జాగరూకతతో ఉండాలని సూచించారు. వయసు రీత్యా వచ్చే మార్పులను గమనిస్తూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవడం వల్ల దీర్ఘకాలిక సమస్యలను నివారించవచ్చని తెలిపారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించేందుకు తమ సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైద్య బృందం సభ్యులు సి హెచ్ ఓ భద్రయ్య, హెచ్ ఇ వసంత,వయోవృద్ధుల సంఘం మండల అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య కవి, మాజీ జెడ్పీటీసీ జున్నుతుల రాంరెడ్డి, వరంగంటి మల్లయ్య, కుమారస్వామి, రామెల్, నామని సురేందర్, సార్యా, పుష్పలత పాల్గొన్నారు.

# శ్రీరాముని అడుగుజాడల్లో విద్యార్థులు నడవాలి



**చెన్నారావుపేట మార్చి 26 (ప్రజా జ్యోతి)** విద్యార్థులు చిన్నతనం నుండే మన పండుగలు సంస్కృతి సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆదర్శ పురుషుడు శ్రీరాముని మార్గంలో నడవాలని పాపయ్యపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పత్తి నరసింహారెడ్డి అన్నారు.గురువారం చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు భారతీయ సంస్కృతి పండుగల విశిష్టతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకుని పట్టుదల నమ్మకంతో కృషి చేస్తే విజయం తప్పక వరిస్తుందని శ్రీరాముడు తన జీవితం ద్వారా నిరూపించారని పేర్కొన్నారు.సమాజంలో గొప్పవారు కావడానికి ధనం ముఖ్యం కాదని సత్యం శీలవంతుడైన గుణాలే మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తాయని తెలిపారు. ప్రజలను కన్నబిడ్డలుగా చూసుకుని పాలన సాగించిన శ్రీరాముడిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కుమారస్వామి, స్వరూప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జనగాం ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ మేళా

**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 26 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర ఆహార పరిరక్షణ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకుల (ఫుడ్ బిజినెస్ ఆపరేటర్స్) కోసం ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ మేళా ఈనెల 30సోమవారం నాడు నిర్వహించడం జరుగుతుందని ఆహార భద్రత అధికారి సి.హెచ్. వినీల్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయం, రూమ్ నెంబర్: జి2 నందు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందన్నారు. ఆహార వ్యాపార నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్లు పొందడం లేదా రెన్యువల్ చేసుకోవాలని కోరారు.ఇతర వివరాల కొరకు ఆహార భద్రత అధికారి: 7306335795,గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్: 9985820544.నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## మిల్స్ కాలనీ ఎస్ఐ పై సస్పెన్షన్ వేటు



**వరంగల్ సిటీ, మార్చి 26(ప్రజా జ్యోతి):** పోలీస్ శాఖకు మచ్చ తెచ్చే పోలీస్ అధికారులపై పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ క్రమశిక్షణ చర్యలు చేపడుతున్నారు. అనేక అవినీతి ఆరోపణలతో పాటు మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించినట్టుగా మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహించిన ఎం సురేష్ పై ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం వరంగల్ ఏఎస్పీ శుభం ప్రకాష్ దృష్టికి రాగానే సదరు ఎస్సైని రెగ్యులర్ గా నియమించే విధుల నుంచి తప్పించి నేర విభాగం విధులు అప్పగించారు. సదరు అంశంపై పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో ఆరోపణలు నిజమని నిర్ధారించారు. దీంతో పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సస్పెన్షన్ వేటు వేశారు. ఎస్.ఐపై వచ్చిన ఆరోపణలు అధికారుల విచారణ లో రుజువు కావడంతో ఎస్. ఐ సురేష్‌ను సస్పెండ్ చేయడం జరిగిందని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారికంగా ప్రకటించారు.

## రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణకు మార్నేని శుభాకాంక్షలు



**వర్ధన్నపేట / అయినవోలు. మార్చి 26, ప్రజా జ్యోతి.** తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియామకం పొందిన అనంతరం, ఎర్రబెల్లి స్వర్ణ నివాసంలో మర్యాదపూర్వకంగా పలువురు ప్రముఖులు కలిశారు. గురువారం మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్ రావు, ఐనవోలు మాజీ ఎంపీపీ మార్నెని వసుమతి ఆమెను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు ఎర్రబెల్లి స్వర్ణకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. మహిళల సమస్యల పరిష్కారంలో ఆమె కీలక పాత్ర పోషించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భేటీ సానుకూల వాతావరణంలో కొనసాగగా, నాయకుల మధ్య పరస్పర చర్చలు జరిగాయి. మహిళా శక్తి సాధికారత దిశగా కృషి చేయాలని వారు సూచించారు.

## మంత్రి సీతక్కను కలిసిన జామ మస్జిద్ కమిటి



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** ములుగు జామ మస్జిద్ కమిటీ ఎన్నిక సందర్భంగా అధ్యక్షుడు అబ్దుల్ రబ్,వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ హఫీజ్ బాబా,సెక్రటరీ అఫ్రోజ్, జాయింట్ సెక్రటరీ షర్ఫుద్దీన్, ట్రెజరర్ హాజీ పాషాలను ఎన్నుకోవడం జరిగింది.ఈ మేరకు వారు పంచాయతీ రాజ్ స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్కను మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మసీదు అనేది కేవలం ప్రార్థన స్థలం మాత్రమే కాదు,అది మన సమాజానికి ఐక్యతను, శాంతిని,సహనాన్ని,సోదర భావాన్ని పెంపొందించే పవిత్ర కేంద్రం.ఇక్కడ మనం భక్తితో నమాజ్ చేయడమేకాకుండా, పరస్పర గౌరవం,సేవాభావం, నైతిక విలువలను కూడా నేర్చుకుంటాము.కొత్త కమిటీ సభ్యులు మసీదు అభివృద్ధికి కృషి చేస్తూ,సమాజంలో మంచి మార్పులను తీసుకు రావాలని ఆకాంక్షిస్తున్నాం. అందరం కలిసి మసీదు పవిత్రతను కాపాడుతూ, ఐక్యంగా ముందుకు సాగుతామని తెలిపారు.

# ఉప్పరపల్లి హైస్కూల్‌లో రీడింగ్ రూమ్ ప్రారంభం

- జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి జిల్లా కలెక్టర్ సత్య శారద
- ప్రభుత్వ బడులకు 200 కంప్యూటర్లు అంద జేస్తాం మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్
- పుస్తక పఠనంతోనే మానసిక వికాసం అడిషనల్ కలెక్టర్ సంధ్యా రాణి





**చెన్నారావుపేట మార్చి 26 (ప్రజా జ్యోతి)** ప్రజా పాలన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన విద్యా చైతన్య కార్యక్రమాలు గ్రామీణ విద్యార్థులకు వరంలా మారాయని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద పేర్కొన్నారు. గురువారం చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పౌర పఠనాలయం రీడింగ్ రూమ్ ను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగ యువతకు కావాల్సిన పోటీ పరీక్షల మెటీరియల్ దినపత్రికలు కెరీర్ గైడెన్స్ ఈ రీడింగ్ రూమ్స్ ద్వారా అందుబాటులోకి వస్తాయన్నారు. గ్రూప్ డిస్కషన్స్ క్విజ్ పోటీల ద్వారా విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తామని తెలిపారు. పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించిన కలెక్టర్ వారి భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. క్రాఫ్ట్ టీచర్ ఇందిరా పర్యవేక్షణలో విద్యార్థులు తయారు చేసిన కళాఖండాలను చూసి ఆమె ముచ్చటపడ్డారు .నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే 60 కంప్యూటర్లు పంపిణీ చేశామని త్వరలోనే మరో 200 కంప్యూటర్లను అందజేస్తామని వెల్లడించారు. అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ... గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. డిఈఓ జిల్లా విద్యాశాఖాధికారి రంగయ్య నాయుడు మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలోనూ లైబ్రరీ పీరియడ్‌ను ఖచ్చితంగా నిర్వహించాలని విద్యార్థుల్లో పఠన సామర్థ్యాన్ని పెంచే బాధ్యత ఉపాధ్యాయులదేనని స్పష్టం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన 'సెల్ఫీ పాయింట్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కలెక్టర్ తో సహా ఇతర అధికారులు అక్కడ ఉత్సాహంగా ఫోటోలు దిగారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి అలివేలు, డిఎంహెచ్ఓ సాంబశివ రావు, మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ, తహసీల్దార్ మహమ్మద్ దిలావర్ అబిద్ అలీ, ఎంపీడీఓ అయేషా పర్వీన్, ఆర్ఐ రషీద్, ఎంఈఓ పాపమ్మ, ఉప సర్పంచ్ అన్వేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మెప్మా ఆధ్వర్యములో వైద్య శిబరం. పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ - పాలకుర్తి సారంగపాణి





**వర్ధన్నపేట, మార్చి 26 ప్రజా జ్యోతి.** వర్ధన్నపేట పురపాలక సంఘం నందు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘం సభ్యులకు, శానిటేషన్ సిబ్బందికి మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అధ్యక్షతన వైద్య శిబరం ఏర్పాటు నిర్వహించారు. అనంతరం పాలకుర్తి సారంగపాణి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజా పాలన ధ్యేయంగా, ప్రజల సమస్యల కోసం ఎనలేని కృషి చేస్తూ, మహిళా సంఘాల సభ్యులకు సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ మహిళలను అభివృద్ధి పథంలో నడిపిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయి. సీఎం రేవంత్ రెడ్డి నిత్యం ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ స్వచ్ఛమైన పరిపాలన అందిస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే నాగరాజు ఆధ్వర్యంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందే విధంగా కృషి చేస్తామని తెలిపారు . ఈ కార్యక్రమంలో వరంగల్ అడిషనల్ కలెక్టర్ వై. వి గణేష్, కమీషనర్ ఇమ్మడి సుధీర్ కుమార్, వైస్ చైర్మన్ నేతావత్ శిభారాణి, పీహెచ్సీ, డాక్టర్ అరుణ్ చంద్ర, వార్డు కౌన్సిలర్లు బానోతు జ్యోతి, నునవత్ కమిలి, మాలోతు దేవేందర్, చిలువెరీ రమ, తిరుపల్లి వాణి, డి ఎం సి రేణుక, ఏడిఎంసి వహీదా లు, ఆశ వర్కలు, రిసోర్స్ పర్సన్ మరియు మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గొదిరే ..నీపని అదిరే...!

- విద్యుత్ తీగలపై సర్కస్ ఫీట్లను తలపించిన అన్ మ్యాన్డ్ వర్కర్ సూరయ్య
- లైన్ క్లియరెన్స్ కోసం చెట్ల కొమ్మలు తొలగింపు



**వెంకటాపూర్ మార్చి 26 (ప్రజాజ్యోతి):** ప్రజలకు నిత్యం విద్యుత్ వెలుగులు అందించేందుకు ప్రాణాలకు తెగించి సిబ్బంది చేసే సాహసాలు,శ్రమ చాలా మందికి కనిపించవు. గురువారం మండలంలోని ఇంచెంచెరువుపల్లి గ్రామ పరిధిలో విద్యుత్ లైన్ క్లియరెన్స్ లో భాగంగా చెట్ల కొమ్మలను తొలగించేందుకు అన్ మ్యాన్డ్ వర్కర్ గొదిరె సూరయ్య విద్యుత్ తీగలపై నడిచి వెళ్తూ సర్కస్ ఫీట్లను తలపించేలా చేసిన పనులు విద్యుత్ సిబ్బంది కష్టాలకు ప్రతిబింబంగా కనిపిస్తున్నాయి.మండు వేసవిని సైతం లెక్కచేయ కుండా రైతులకు విద్యుత్ ఆటంకాలు లేకుండా ఉండేందుకు తీగల వెంట ఉన్న సమస్యలను తొలగించేందుకు వెంకటాపూర్ ఏఈ రమేష్ ఆధ్వర్యంలో ఏఎల్ఎం కృష్ణాకర్ సిబ్బందితో కలిసి చేస్తున్న పనులలో వెంకటాపూర్ సెక్షన్ లక్ష్మీదేవి పేట పరిధిలో పనిచేస్తున్న అన్ మ్యాన్డ్ వర్కర్ పని తీరును చూసిన పలువురు గొదిరే సూరయ్య..నీ పని అదిరిందయ్యా...అంటూ అభినందిస్తున్నారు.కాగా ఎన్‌పీడీసీఎల్ సీఎండీగా కార్తికేయ మిశ్రా ఉన్న సమయంలో అన్‌మ్యాన్డ్ వర్కర్ వ్యవస్థ అమలులోకి వచ్చింది.2013 నుండి వీరు పనిచేస్తున్నారు.విద్యుత్ లైన్ మెన్ కింద సహాయకులుగా వీరిని నియమించారు. అన్ మ్యాన్డ్ అంటే అన్‌స్కిల్డ్ అని అర్థం.ఎన్‌పీడీసీఎలలో పని చేస్తున్న అన్‌మ్యాన్డ్‌కార్మికుల శ్రమకు తగ్గ వేతనాలు అందించేలా ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# రంగశాయిపేట సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అవకతవకలు

- బీజేపీ నేత కొల్లూరి యోగానంద్ ఆరోపణలు



**వరంగల్ సిటీ, మార్చి 26 (ప్రజాజ్యోతి):** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని రంగశాయిపేటలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈవో ఎస్. వెంకట్రావు నిర్వహణలో పలు అవకతవకలు జరుగుతున్నాయని రాష్ట్ర బీజేపీ నాయకుడు కొల్లూరు యోగానంద ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. గత సంవత్సరాల ఉత్సవాల లెక్కలను వెల్లడించకుండా, హుండీ లెక్కింపులు కూడా సక్రమంగా చేయకుండా వ్యవహరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే దేవాలయ కార్యవర్గాన్ని ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారని విమర్శించారు. దేవస్థానానికి ఆంధ్రప్రదేశ్‌లోని పెనుగ్రంచిపోలు వద్ద సుమారు 8 ఎకరాల భూమి, తీగరాజు పల్లి లో భూములు ఉన్నప్పటికీ, ఆ భూమి నుంచి వచ్చే కౌలు ఆదాయానికి సంబంధించిన లెక్కలు చూపించడం లేదని యోగానంద్ ఆరోపించారు. ఆ ఆదాయాన్ని దేవాలయ అవసరాలకు వినియోగిస్తున్నామని ఈవో చెబుతున్నప్పటికీ, స్పష్టమైన వివరాలు లేవని అన్నారు. అలాగే దేవాలయ ప్రాంగణంలోని కళ్యాణ వేదిక వద్ద చందా బుక్కులు తీసుకొని ఇష్టారాజ్యంగా వసూళ్లు చేసి, వాటిని వ్యక్తిగతంగా వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తెలిపారు. దేవస్థానానికి చెందిన భూముల విషయంలో కూడా ఎకరాలను గజాలుగా చూపించేలా లెక్కల్లో మార్పులు చేస్తున్నారని, ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు. అలాగే ఉత్సవ ధర్మకర్తల కమిటీలలో రాజకీయ జోక్యం మితిమీరుతోందని తద్వారా దేవాలయ ప్రాశస్త్యం దెబ్బతింటుందని వాపోయారు. ఆధ్యాత్మిక భక్తి సేవా భావం కలిగిన వ్యక్తులను మాత్రమే ధర్మకర్తల కమిటీ లోకి తీసుకోవాలన్నారు. భద్రాచలం తర్వాత అంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ ఆలయంలో వార్షిక కళ్యాణ మహోత్సవాలు, బలిహరణ వంటి ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఇది స్థానికంగా భక్తుల ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. కానీ కొందరి వ్యక్తుల స్వార్థం వల్ల అభివృద్ధికి నోచుకోవడం లేదని అన్నారు. ఉత్సవ ఆహ్వాన పత్రికలలో ఏకపక్షంగా తమకు నచ్చిన నాయకుల పేర్లను ప్రచురిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. రంగశాయిపేట ప్రాంతం నుంచి మాజీ కార్పొరేటర్లుగా పనిచేసిన వారు చాలామంది ఉండగా కేవలం పిఎసిఎస్ మాజీ చైర్మన్, ఓ మాజీ కార్పొరేటర్ పేరును మాత్రమే ఆహ్వాన పత్రికలో ప్రచురించడం వెనక ఉన్న మతలబు ఏమిటని అన్నారు. ఇకనైనా ఈవో వెంకట్రావు స్పందించి, దేవాలయానికి వచ్చే ఆదాయం, చందాలు, వస్తు రూప దానాలు అన్నీ పారదర్శకంగా నిర్వహించి, అవకతవకలు జరగకుండా చూడాలని కొల్లూరు యోగానంద్ విజ్ఞప్తి చేశారు.

## దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ భూసేకరణ పురోగతిపై సమీక్ష




**వరంగల్, మార్చి 26(ప్రజాజ్యోతి):** దేవాదుల జె. చొక్కారావు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూసేకరణ పురోగతిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన గురువారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని నర్సంపేట, దుగ్గొండి, రాయపర్తి, వర్ధన్నపేట, నల్లబెల్లి మండలాల్లో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్ పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసి, ముందస్తు నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, ప్రాజెక్ట్ అమలు సజావుగా కొనసాగేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, పారదర్శకంగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యారాణి, ఆర్డీఓలు సుమ, ఉమారాణి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నేడు రాయపర్తి మండలంలో శ్రీరామనవమి సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి పర్యటన

**రాయపర్తి మార్చి 26 ప్రజా జ్యోతి** నేడు రాయపర్తి మండలంలోని పలు గ్రామాలు తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పలు గ్రామాలలో పర్యటించి శ్రీరామ నవమీ వేడుకలలో పాల్గొంటారని టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నరసింహనాయక్ ఒక ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో ఉదయం 9:00 గంటల నుండి 1) సన్నూర్ 2) రాయపర్తి 3) అరేగూడెం 4) బురాన్ పల్లి గ్రామాలలో జరుగుతున్న శ్రీ రామనవమి వేడుకలలో ఉత్సవా కమిటీ వారి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా పాల్గొనున్నరూ. ఈ పర్యటనల్లో అతనితో పాటు ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి.కావున ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, మహిళా నాయకులు, యూత్ & సోషల్ మీడియా నాయకులు తదితరులు పాల్గొని విజయవంతం చేయగలరు.

## విద్యుత్ ఏఈ రమేష్ సబ్ ఇంజనీర్ సాంబరాజుకు సలాం

- 24 గంటల్లో ట్రాన్స్ఫార్మర్ అందించడం పట్ల లక్ష్మీ దేవి పేట రైతుల సంతోషం



**వెంకటాపూర్ మార్చి 26 (ప్రజాజ్యోతి):** విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు కాలి పోతే తీవ్రంగా ఇబ్బంది పడ్డ రైతుల అవస్థలు తరచూ చూస్తుంటాం.కానీ తక్షణమే స్పందించి ట్రాన్స్ఫార్మర్ కాలిపోయిన 24 గంటల్లో రైతుల సమస్యను తీర్చిన ఏఈ రమేష్,సబ్ ఇంజనీర్ సాంబరాజుకు రైతులు సలాం కొడుతున్నారు.బుధవారం వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట పరిధిలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ కాలి పోవడంతో రైతులు స్థానిక విద్యుత్ అధికారుల ద్వారా సబ్ ఇంజనీర్ దృష్టికి తీసుకెళ్లారు.దీంతో గురువారం ట్రాన్స్ఫార్మర్ ను ఏర్పాటు చేశారు. దీంతో రైతులు ముక్కెర వీరయ్య , మామిండ్ల మల్లక్క,గౌడుగు సదానందం,కేతిరి రమేష్ , నత్రం సారయ్య,రంగశెట్టి రవి,ఎర్ర రమేష్ తోపాటు గ్రామస్తులు విద్యుత్ అధికారుల పనితీరు పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## సీకే తండాలో బీఆర్ఎస్ నేతల సందర్శన, సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మానం





**పర్వతగిరి, మార్చి 26 (ప్రజాజ్యోతి )** పర్వతగిరి మండలంలోని సీకే తండాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దారావత్ లక్ష్మి బాలాజీతో పాటు వార్డు సభ్యులు, పార్టీ నాయకులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడిన నేతలు, తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా మార్చిన విషయాన్ని గుర్తు చేశారు. సాగు నీరు, తాగునీటి సౌకర్యాలు కల్పించి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ముఖ్యంగా తండాల అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎం. మనోజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మాజీ ఏఎంసీ డైరెక్టర్లు బోయినపెల్లి యుగేందర్ రావు, పట్టపురం ఏకాంతం గౌడ్, జిల్లా యాదవ సంఘ నాయకులు చీమల బిక్షపతి, సర్పంచ్ ఎర్పుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు సంపెల్లి శోభ పరమేశ్వర్ రావు, కొల్లూరి వెంకటేశ్వర్లు, మాడుగుల రాజు, మండల నాయకులు బొట్ల మధు, పిండి వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు చిరుత విజయ్, దొమ్మటి రాజు, స్థానిక నాయకులు బాలు, వీరన్న నాయక్, బద్రునాయక్, యువత, సోషల్ మీడియా నాయకులు దబ్బేట నరేష్, చిన్నపెల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో జాగ్రత్తలు పాటించాలి అధికారులు తగు చర్యలు తీసుకోవాలి

- : జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా




**జనగామ జిల్లా ప్రతినిధి, మార్చి 26 (ప్రజాజ్యోతి ):** వేసవి ఎండల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్త గా ఉండాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. వాతావరణ మార్పులు ప్రజా ఆరోగ్యం అనే అంశం మీద పోలీస్,వైద్య మరియు ఆరోగ్యం, వ్యవసాయ, గ్రామీణభివృద్ధి శాఖ మున్సిపల్ కమిషనర్ లు, పంచాయతీ శాఖ, తదితర శాఖలకు సంబందించిన అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా జిల్లా స్థాయి సమన్వయ సమావేశాన్ని గురువారం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించారు. వడ దెబ్బకి ఎలాంటి నష్టాలు కలగకుండా శాఖల వారీగా వారి పరిధిలో తీసుకోనున్న యాక్షన్ ప్లాన్ ను కలెక్టర్ ముందుగా ఆయా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రయివేట్, ప్రభుత్వ విద్యార్థులకు, గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు, ఆశ వర్కర్ లకు, ఓఆర్ఎస్ ప్యాకెట్ లు అలాగే వడ దెబ్బకి సంబందించిన మందులను పంపిణి చేయాలన్నారు. అన్ని జీపీ, వార్డ్ లలో, బస్ స్టేషన్ లలో, పోలీస్ స్టేషన్, నిర్మాణాలు జరిగే ప్రాంతాలలో, లేబర్ అడ్డాల వద్ద కూలి పని చేసే కార్మికుల కోసం చలి వేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. వడ దెబ్బకు గురి అయ్యే అవకాశం ఉన్నవారిని అనగా చిన్న పిల్లలు, అధిక రక్తపోటు, మధుమేహ వ్యాధి గ్రాస్తులను ఉందుగానే గుర్తించి వారికీ తగు జాగ్రత్తలు తీసుకునేలా ఆరోగ్య కార్యకర్తల ద్వారా తెలియచేయాలనీ సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్య సంస్థలలో,అంగన్వాడీ కేంద్రాలలో ఓఆర్ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రత్యేక వార్డ్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లకూడదని, ముఖ్యం గా పిల్లలు, వృద్ధులు, గర్భిణీ లు చాలా జాగ్రత్త గా ఉండాలన్నారు. తరచుగా తాగునీరు, మజ్జిగ, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, లేదా ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కలిగించాలని వివిధ శాఖల అధికారులకు కలెక్టర్ తెలిపారు. తీవ్రమైన ఎండ, వడ దెబ్బను ఎదుర్కొనేందుకు ప్రజలు చెయవలిసినవి, చేయకూడని జాగ్రత్తలను తెలిపే పోస్టర్ అలాగే వేసవిలో పశు సంరక్షణ కి సంబందించిన పోస్టర్ లను ఈ సందర్భంగా కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ఏసీపీ పండరి చేతన్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, డిఆర్డీఓ, జిల్లా వ్యవసాయ అధికారి, విద్యుత్ శాఖ ఎస్ఈ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.